# రైలు దిగిన మనుషులు



రైలు వెళ్లిపోతూంది.

వాళ్లంతా రుమాళ్ళు ఊపుతున్నారు, కిటికీల్లోంచి చేతులు అవతలకు పెట్టి.

బై బై, గుడ్‌బైలు రైలు హోరులో కలిసిపోతున్నాయి. హోరు దూరమయ్యే కొద్దీ చెవుల్లో ఇంకా స్పష్టంగా గింగురుమంటున్నాయి. దూరంగా మలుపు తిరిగి పోతూందిబండి. ప్లాట్‌ఫారమ్‌మీదకాళ్లు అతుక్కుపోయి నిలబడి ఉన్నాం అరుణా, నేనూ. అరుణ ఆ రైలు వైపే తదేకంగా ఊడిపడే కళ్లతో చూస్తూంది. నుదుట చిరుచెమట. నాకు ఏదో మంటగా, కసిగా ఉంది. ఆక్రోశంగా నేనూ అరుణ చూస్తున్నవైపే చూస్తున్నాను. రైలు కంటిచూపునుంచి తప్పుకుంది. [illegible]

పెట్టెకూడా మలుపు తిరిగి పోయింది. ఏదో సాధించిన అనుభూతి, పీడకలనుంచి బయటపడ్డట్టు.

అరుణకేసి ఆప్యాయంగా చూశాను. పాలిపోయి శూన్యంలోకి ఇంకా చూస్తూనే ఉంది.

ఒక్కసారి అనిపించింది— ఆ చెంపలను ఆర్ద్రంగా నిమురుతూ ఇలా చెప్పాలని: 'అది మనం దిగిపోయిన రైలు, అరుణా!'

* * *

శ్రీకాకుళం నుంచి జనతాలో వస్తున్నాను. లంఖణాలబండి ఆవులిస్తూ, జోగుతూ మత్తుగా వెళుతూంది. స్లీపర్ కోచ్ ఖాళీగా, చీకటిగా ఉంది. గొణుక్కుంటూ ఇంకేం చేయాలో తెలియక నేనూ తూగుతున్నాను.

విశాఖ వెలుగులతో మెలకువ వచ్చింది. స్టేషను అంతా కలకలలాడుతూంది. అంతా స్టూడెంట్లే. అన్నట్టు ఈ రోజే యూనివర్సిటీలో పరీక్షలు పూర్తయి పట్టున్నాయి. వీళ్లంతా బోరుకొట్టే సంజాకు తింట్రారా దేవుడా అనిపించింది. నే నున్న బోగీమీదికి ఓ పదిమంది దండెత్తి వచ్చారు. అబ్బాయిలాంటి అమ్మాయిలూ, సన్యాసుల్లాంటి అబ్బాయిలూ. బడబడా వాగేస్తున్నారు. పూనుకు తిరిగేస్తున్నారు. నా చుట్టూ సీట్లన్నీ ఆక్రమించేశారు. 'హమ్మయ్య! అందరికీ ఒక చోటే సీట్లిచ్చాడు' అని టి. టి. ఇ. ని మెచ్చుకుంది ఒక గుండ్రటి కళ్ల అమ్మాయి. ట్రాన్సిస్టర్లూ, ఫ్లాస్కులూ, పేకముక్కలూ, పెట్టే బేడా... అన్నీ హడావిడిగా సర్దేస్తున్నారు.

ఈ జత్తుపోలిగాళ్లందరికీ దేన్ని చూసుకుని ఈ మిడిసిపాటు అని ఆక్రోశం మొదలైంది నాలో. ఈ సరంజామా అంతా చూస్తూంటే చదువుకుని యూనివర్సిటీ నుంచి వస్తున్నట్టు లేదు. ఏదో ఎక్స్‌కర్షన్ నుంచి తిరుగు ముఖం పట్టినట్టుంది.

కాని, నా ఊహ సరైనదే.

'భీమిలీలో ఎంత హాయిగా గడిపాం ఈ వేళ!' రెండు జెడలతో సీటులో దుమ్ము దులుపుతూ అంటూంది ఓ అమ్మాయి. సీటునే కాకుండా పక్క కూర్చున్న అబ్బాయి పాంటునుకూడా దులిపేస్తూంది.

'ఎంత త్వరగా దగ్గరయ్యాం, చారూ! ఎంతగా కలిసి పోయాం!' గతాన్ని నెమరు వేసుకుంటూ కళ్లలో వెలుగును నింపుకుంటున్నాడు అతను.

చారూ, పులుసూను. బాగుంది.

'పాడు కలలా పరీక్ష అయిపోయింది. ఒక్కసారిగా మరో ప్రపంచంలోకి ఆడుతూ పాడుతూ వెళ్లిపోయాం.'

'ఈ రాత్రంతా కలిసి ప్రయాణం చేస్తాం. మళ్లీ ఎవరికి వాళ్లమే. . . ప్!'

ఒక్కసారిగా అందరూ మూగబోయి నట్లయ్యారు.

'మళ్లీ కలుసుకోగలమేమో కాని, మళ్లా కలిసి ఉండలేం కదూ?'

నన్నూ కదిలించిం దీ మాట. ఒక్క క్షణం జాలేసింది. వీళ్లంతా ఒకే క్లాసులో కొన్ని ఏళ్లు కలిసి కట్టుగా ఉన్నవాళ్లు. విడిపోతున్నారు. గుత్తినుంచి విడివడి వాడి పోయే పూలలా.

కాని, మరో రెండేళ్లు పోయాక చూస్తే? ఉద్యోగాల కోసం చెప్పులు అరుగుతూ కొందరూ, పెళ్లికొడుకుల ముందు పెళ్లి చూపులకు కూర్చుంటూ లేస్తూ కొందరూ.

ఒకళ్ల నొకళ్లు జ్ఞాపకం చేసుకునే దెందరు?

నా కళ్లముందు ఈ నిమిషంలో మెదులుతున్నారు— యశోధర, రాజేశ్వరి, ఫిలిప్స్. . . ఏరీ వీళ్లంతా? నాకే మవుతారు? నేను ఒక్క క్షణమన్నా వాళ్ల మనసుల్లోకి వస్తానా? ఏమో! బి. ఎ. చివరన విడిపోతూంటే యశోధర కళ్లలో నిండిన నీళ్లను చూస్తూ, వాటిని తుడవగలిగీ తుడవలేక పోయిన నన్నూ, నా అసమర్థతనీ నిందించుకుంటూ కదిలిపోయాను. నా గుండెల్లో ఆమె ఎప్పుడూ ఉంటుందనుకున్నాను. ఏదీ?

'అరుణా! సముద్రం హోరులో మీరు పాడిన పాట చెవుల్లో ఎప్పుడూ ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది' వీళ్ల సొది వీళ్లదే కదా! నా ఆలోచనల్ని తెంచినందుకు కసురుకున్నాను.

'వందన సమర్పణలా నుందరం?' అంతా నవ్వారు. తల పట్టుకు కూర్చున్నాను.

హమ్మయ్య! రైలు కదులుతూంది ఎన్ని యుగాలకి!

అత నెవరో భావకవిలా ఉన్నాడు.

## టి. ఎస్. వెంకటరత్నం

కంగారుగా దిగి వెళ్లి దోసిలి నిండా మల్లెలు తెచ్చి అమ్మాయిలందరి ఒళ్లలో పోశాడు. వాళ్ల కళ్లు చెమరుస్తున్నాయి జెడల్లో ముడుచుకుంటూ ఒక్కొక్క పూవూ అబ్బాయిలకి ఇస్తున్నారు.

'నువ్వు తెచ్చి ఇచ్చిన వాటిలోదే ఇస్తున్నాను తీసుకో, రాజేంద్రా!' ఆ అరుణ చెమరుస్తూన్న కళ్లతో ఒకతనికి ఇచ్చింది.

చాల్లేండయ్యా. మేం చదువుకున్న రోజుల్లో మేమూ ఇలా ఆత్మీయతలు కుమ్మరించుకున్నవాళ్లమే. ఏదీ? కాలం గడిస్తేకద, నీటిమీద రాతల్లా ఎలా చెరిగిపోయేదీ తెలిసిరావటానికి!

> ### ప్రశ్న
> మనిషి అడిగే ప్రశ్నలను బట్టి అతని మేధస్సు గ్రహించాలి గాని, అతను ఇచ్చే సమాధానాలను బట్టి కాదు.
>
> —వోల్టేర్

'విశాఖపట్టణానికి వీడుకోలు' అంటున్నాడు ఒకడు. పెట్టెలో మిగతా ప్రయాణికుల కేసి చూశాను. కళ్లప్పగించి బైతుల్లా చూస్తున్నారు. యూనివర్సిటీ స్టూడెంట్లు అంటే ఎంత గ్లామరూ గట్రా మరి! రేపు ఆ ఎమ్. ఎ. కాగితాలు పట్టుకుని నాలుగు రోజులు తిరిగేసరికి వీళ్ల మిడిసిపాటూ చల్లారుతుంది, దానితోబాటే ఆ గ్లామరూ చప్పబడుతుంది.

ఆ గిరగిరా తిరిగే కళ్ల అమ్మాయి మళ్లీ మొదలు పెట్టింది, కళ్లు దీనంగా వాల్చేసి, 'మనం అందరం. . . మళ్లీ ఎన్నాళ్లకి కలుసుకోగలం?'

'చప్పున మీరు శుభలేఖలు పంపించేస్తే సరి.'

అందరూ నవ్వేశారు ఘొల్లున. ఆ అమ్మాయి కందిన బుగ్గలతో గారంగా పెదవిని వంకరలు తిప్పుతూ నవ్వుతూంది. వీళ్ళూ, వీళ్ల చెత్త జోకులూ, వాటికి నవ్వులూ అని సణుక్కున్నాను.

'మనలో మనం ఎవరి పెళ్లి జరిగినా అందరం తప్పకుండా హాజరవ్వాలి.' ఒక మహాశయుడు ప్రతిపాదించాడు. అంతా ఏకగ్రీవంగా ఆమోదించారు.

కుర్రకారు. తెలియదు. నే నిమధ్య మా సేతుమాధవి సీతాంత (ఒకే మనిషి పేరు) పెళ్లికి వెళ్లాను. కలిసి అయిదేళ్లు చదువుకున్నవాళ్లం. ఆమెను 'సేతూ' అని ఎప్పుడూ పిలిచేట్టు పిలిచేసరికే పెళ్లికొడుకుగారి మొహంలో రంగులు మారిపోయాయి. ఇలా ఉంటాయి పరిస్థితులు. ఇదే ఆర్భాటంతో, ఇవే అవతారాల్లో ఈ సజ్జు అంతా కలిసి ఏ అమ్మాయి పెళ్లికి వెళ్లినా, ఆ పెళ్లి అమాంతంగా ఆగిపోయే పరిస్థితులు వచ్చేయచ్చు.

అంతా కలిసి పేక వేశారు. ఒక హాండ్ తక్కువైతే నన్నూ కలవమన్నారు. మొదలుపెట్టాం. కాని, ఒక్కళ్ల దృష్టి ఆటపైన లేదు కద!

ఈసారి సొది యూనివర్సిటీ లెక్చరర్లూ, క్లాసులూ వైపు మళ్లింది. ఒకసారి క్లాసులో ఒక శ్రీనివాసరావు నిద్రపోతున్నాడట. లెక్చరర్ లేపి మొహం కడుక్కు రమ్మన్నాడట. అతగాడు బయటికి వెళ్లి కాసేపటికి తిరిగి వచ్చాడట. "సారీ, సార్" అని క్షమాపణ చెప్పుకున్నాడట. లెక్చరరు— "ఫరవాలేదు లేవోయ్, ఇంకెప్పుడూ క్లాసులో నిద్ర పోకు" అన్నాడట. సదరు శ్రీనివాసరావు— "అది కాదు, సార్, కుళాయిలో నీళ్ళు రావటం లేదు. మొహం కడుక్కో లేదు, సార్" అన్నాడట.

'ఆ దెబ్బతో లెక్చరర్‌ని భలే చిత్తు చేశాడు, శీనూ' అంటూంది చారు— ఈ కథంతా చెప్పి.

గతుక్కుమన్నాను. నా విద్యార్థులు నన్నూ ఇలాంటి విశేషణాలతోనే సత్కరిస్తూంటారా?

'ఇక మళ్లీ పరీక్షల జ్వరాలు ఉండవు బతుకంతా. ఏ ప్రొఫెసరుకీ భయపడుతూ చావక్కర లేదు.' తాపీగా నిట్టూరుస్తున్నాడు ఆ శీను.

'గూడు వీడిన పక్షులం' అంది అరుణ, భుజాలు కుదిపి రెండు జడలూ ముందుకేసుకుని, మళ్లీ వెనక్కి విసురుకుని.

'అన్నట్టు, మీ రేం చేస్తున్నారు, మాస్టారూ?' కరక్కాయలాంటి ప్రశ్న మీది కొచ్చి పడింది. వీళ్లంతా. . . కాలేజీ. . . లెక్చరర్లూ. . . పరీక్షలూ— ఈ తలనొప్పి నుంచి బయట పడిపోతూన్న మనుషులు. మరి. . . నేను...

'లెక్చరర్‌గా ఉంటున్నానండీ!' కష్టంగా చెప్పాను. వాళ్ల మొహాల్లో కళ కొన్ని కారెట్లు ఒక్కసారిగా తగ్గిపోయింది. అవును మరి— పానకంలో పుడక నేను. చాలా ఇబ్బందిగా ఫీలయ్యాను. ఎవరూ నోరు మెదపక పోవటం మరీ దుర్భరంగా ఉంది.

ప్రయత్నంమీద రెండు ఆవులింతలు తెచ్చుకుని, చిటికెలుకూడా వేసుకుని, 'నిద్రపోతాండండీ' అంటూ బెర్తు చేరుకున్నాను.

సన్నగా వినీ వినబడనట్టు ఒక ఆడ నిట్టూర్పు వినబడింది. బుర్ర గిర్రున తిరిగింది. 'వదిలాడురా బాబూ!' అనుకుంటున్నారా?

బుద్ధి తెలిసినప్పటినుంచీ చదువులు మొదలౌతాయి. ఆ చదువు చదివి ఏదో గొప్పవాళ్లమైపోతామన్న ఆశా, నమ్మకం ప్రతి విద్యార్థిలోనూ ఉంటాయి. తాము చేరుకోబోయే ఆ గొప్ప హోదాముందు, తమ ఎదురుగా తమకు చదువు చెపుతున్న బడిపంతులు, గిరిగాని లెక్చరరు [illegible]

గాని చప్పగా దిగదుడుపుగా కనిపిస్తాయి. ఎంత దురదృష్టకరమైన పరిస్థితి!

అధ్యాపకుల స్థాయి పెరగాలి. తీర్మానించేశాను. ఏ ప్రధానినో అయితే ఇప్పుడే అమలు జరిపించేద్దును. నీరసంగా నవ్వుకున్నాను.

ఎంత మారిపోయాను!

విద్యార్థి ఉద్యోగిగా మారటం వరుగు లెత్తే అవుదూడ అంగాలు కొట్టేసి ఎద్దుగా మార్చేసినట్లేనా?

ఘొల్లుమంటూ నవ్వులు వినిపిస్తున్నాయి

నా ఆలోచనల్నికూడా వినేస్తున్నారా?

నా గురించేనేమోనని బెంగ.

ఎంత అతిశయం అని ఆక్రోశం.

బుద్ధి లేదంటూ క్రోధం.

నిజంగా ఎంత మారిపోయాను! ఎదుటి వాళ్ల సంతోషాన్ని చూసి సంతోషించే పాటి సంస్కారాన్నికూడా పోగొట్టేందా నా ఏడాది నిరుద్యోగమూ, మరో ఏడాది చిరుద్యోగమూ?

కళ్లనుంచి ఆవిరి వస్తూన్నట్టుంది. రెండు చేతులతో కళ్లు కప్పుకున్నాను. శూన్యంలో ఏదో నా మొహంలా కనపడుతూంది. ఆ భావంగా, రాతిబొమ్మలా. ఇలాంటి ఫోటోనే ఎక్కడో చూసినట్టున్నాను. ఈ వేళ పేపర్లోనే.

అవును, ఎవరో చచ్చిపోయిన వాడి శవంబొమ్మ.

ఒళ్లు గగుర్పొడిచింది.

ఛీ, ముసిరి ఆలోచనలు.

అంతా ఈ మేళం సజ్జు వల్ల.

'ఇప్పీ ఇప్పీయ్యాయ్యా
ఇప్పీ ఇప్పీయ్యాయ్యా. . .'

అంతా కలిసి భోరున మొరుగుతున్నారు. ఒకటే వకవకలూ, ఒకే వెకవెకలూ.

వీళ్ల మధ్య కూర్చోలేను. దూరంగా పోలేను. నిద్ర పోలేను. ఈ హంగామా అంతా చూస్తూ, నా విద్యార్థి జీవితం జ్ఞాపకం తెచ్చుకుంటూ ఇప్పటి బ్రతుకు పోల్చుకుంటూ కుళ్లు కోవటమే నేను చేయగలిగినది.

జనతా విట్టూరుస్తూ అనకాపల్లిలో ఆగింది.

హమ్మయ్య!

కాసేపు గాలి పీల్చుకోవచ్చునను కుంటూ దిగిపోయాను. మళ్లు తిరుగుతున్న ఆలోచనలతో చీకట్లో ఈ చివర నుంచి ఆ చివర వరకూ పచార్లు చేస్తున్నాను. నీడలుగా కనిపిస్తూ, రాజేంద్రా, అరుణా ఒక చెట్టుకింద దగ్గరగా ఒకరి చేతులు ఒకరు పట్టుకుని మౌనంగా మాట్లాడుకుంటున్నట్లున్నారు. ఆకుల మధ్యల్నించి వెన్నెల ఇద్దరి మధ్యా కురుస్తూంది. గిరుక్కున వెనక్కి తిరిగాను

మనసుకూడా గత దృశ్యం ఒక దాని వైపు గిర్రున తిరిగింది. రాజేశ్వరీ, నేనూ ఎంతో దగ్గర స్నేహితులం. ఎమ్. ఎ. అయిపోతూంటే స్నేహంకూడా అలాగే ఆగిపోతుందని ఎప్పుడూ అనుకోలేదు. మరేదోగా మారుతుందనే నమ్మాం. ఆ నమ్మకం ఎప్పుడూ మాటల్లో వ్యక్తం కానేలేదు. కాలేజి డేనాడు ఏదో నాటకంలో పాత్రగా నేను తెర వెనక నించుని ఉన్నాను. రాజేశ్వరి, ఎందుకో మరి, వచ్చి పక్కనే ఏదో మాట్లాడుతూంది. హఠాత్తుగా లైట్లు ఆరిపోయాయి. ఒక్క క్షణం, ఆమె తన పెదవితో మృదువుగా నా పెదవుల పైన రాసింది. ఆ ఒక్క క్షణమే. ఇంతలో లైట్లు వెలిగాయి. తల దించుకుని వెళ్లిపోయిందామె. మా మధ్య ఒక రకమైన వ్యక్తీకరణ అంటూ ఉంటే అదొక్కటే. కాని ఇప్పుడు. . . ఆ క్షణపు విలువ స్మృతిలో తప్పితే ఇంకెక్కడ కనపడుతుంది?

నా పెదవితో నేనే నా పెదవినేస్పృశించి, రాశాను.

ఈ రాజేంద్ర, అరుణ... మరెందరో ఇలా ఇప్పుడే కలిసి మరెప్పటికీ విడిపోయే వాళ్ళు.

బుద్ధిగా పెట్టెలోకి వెళ్లి కూలబడ్డాను.

రైలు కదులుతూంటే వెలిగిపోతూన్న మొహంతో అరుణ, వెనకే రాజేంద్ర అడుగు పెట్టారు.

చారు చటుక్కున ఒక ప్రశ్న వేసింది.

'రెండేళ్లు పోయేసరికి మనందరం ఎలా తయారౌతామో?' ఇదే ధోరణి ఇంకా కొనసాగుతూందప్పుడుమాట.

ఒక అనుమానం వచ్చింది. ఈ అమ్మాయికి ఈ ప్రశ్న నా మొహం చూసి రాలేదు కదా?

"అమ్మాయ్, బ్రతుకులో విద్యార్థి దశ ఓ రైలు ప్రయాణం లాంటిది. అంతా కొత్తదనంతో గమ్యం గురించి కమ్మని ఊహలతో సాగిపోతుంది. ఒక రోజు ఒక స్టేషన్లో ఒకళ్లం దిగిపోతాం. రైలు కదిలిపోతుంది. ఆ రైల్లో వాళ్లకి ఇంకా ఆ కొత్తదనం, ఆ కమ్మటి ఊహలూ ఉంటూనే ఉంటాయి. ఒకసారి దిగిన వ్యక్తికి తానక్కడ దిగబడి పోయినట్టు ఫీలవటానికి ఎంతో కాలం పట్టదు. కాని ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు ఆ చదువుల రైలుమించి జీవితపు ప్లాట్ ఫాం మీదికి దిగక తప్పదు."

నా ఘోష ఆమెకు ఎలా వినబడుతుంది?

'అరుణ సామర్లకోటలో దిగిపోతుంది, బెంగగా అంటున్నారెవరో.

'ఓహో! ఇందుకా ఈమె బుగ్గలు పిఠాపురం దాటినప్పటినుంచీ పాలిపోతున్నాయి!

'అరుణా, మళ్లీ ఎప్పుడు కలుసుకుంటామో? ఒక పాట పాడవూ. . . ఆఖరుసారి.'

ఒకసారి అందరికేసీ, బయటి వెన్నెల కేసీ చూసి మొదలుపెట్టింది అరుణ.

'కభీతన్ హాయిమోం మే. . . హమారీ యాద్ ఆయేగీ. . .' మల్లెల పరిమళంతోబాటు గుండెల్లోకి దొలుచుకుంటూ పోతూంది ముబారక్ బేగం పాట అరుణ నుంచి. పాట ఆగిపోయేసరికి గుండెల్లో ఏదో కెలికినట్లైంది. కాని . . . కాని. . .

ఈ 'యాద్' నా పట్ల ఎందరికి ఉంది ఇప్పుడు? నా కోసం ఇలాటి పాట పాడే వారెవరున్నారు?

గతకాలపు దృశ్యాలన్నీ ఒక్కొక్కటే ఒక్కొక్క అపురూపమైన కన్నీటి బొట్టుగా రాలబోతూంటే తమాయించుకున్నాను.

రాజేంద్ర అందుకున్నాడు.

'నీలిమేఘాలలో గాలికెరటాలలో నీవు పాడే పాట. . . వినిపించునేవేళ . . .'

నా స్నేహితుడు నారాయణ వెంటనే జ్ఞాపకం వచ్చాడు. శ్రీ కోసం 'ఎగిసి పోకే హృదయమా' అంటూ ఎన్ని పాటలు పాడే వాడని! ఆ అమ్మాయి మరీ మరీ అడిగి పాడించుకునేది 'నీలిమేఘాలలో' పాట. అలా అలా ఎన్నో ఊహలూ ఆశలూ పెంచుకున్నాడు. ఆమెకు పెళ్లైంది. అతనూ నిద్రబిళ్లలతో శాశ్వతంగా నిద్ర పోయాడు.

విద్యార్థి జీవితం. . . ఇంద్రధనుసులా ఎన్ని రంగులు. దానిలో. . . ఎంత ఆకర్షణ. . . కాని బ్రదుకు తుఫానులో చెదిరి పోవటానికి ఎంత సేపు. . .

సామర్లకోటలో జనతా గురక నాపి ఆగింది.

'హేపీ జర్నీ. . . ప్లెజెంట్ టైం . . . మరిచిపోరు కదూ?' హడావిడిగా నవ్వేస్తూ, అనేస్తూ, అంతలోనే మొహాన్ని నయాపైసంత చేసుకుంటూ సామాన్లతో దిగిపోతూంది అరుణ.

నేనూ ఇక్కడే దిగాలి. దిగుతున్నాను.



"మోమెల్ల కనులు"
చిత్రం—వి. పద్మాబాయి
(కొత్తగూడెం)

'టాటా అరుణా, గుడ్ బై. . .'

అంతా చేతులు ఊపుతూ ఉద్వేగంగా చెపుతున్నారు.

నాకు ఇలా వీడుకోలు ఇచ్చేవారెవ్వరు? వీళ్లకు నే నేమీ కాను. నే నొక్కడినే. నాకు నేనే. బ్రతుకు గాడిలో 'పడ్డ గానుగెద్దు'లన్నీ ఇంతే. ఒళ్లు రవరవలాడుతూంది.

రైలు కదిలిపోతూంది.

పీడ వదిలినట్లు.

వాళ్ల కేకలూ, అరుపులూ ఇంకా దురద పెడుతున్నాయి.

అరుణ కేసి చూశాను.

వీళ్లు కుమరుగైతే, ఈ రైలు వెళ్లిపోతే, ఈమే నా లాగే బయట మిగిలిపోతుంది.

పాలిపోయి వణుకుతూన్న పెదవులతో అటే చూస్తూంది అరుణ.

ఈమె గురించి ఇంక నాకు అసూయ పడటానికేముంది? ఇద్దరం మాకు మేముగా మిగిలిపోయిన వాళ్లమే.

అందుకే అనిపించింది—

ఆమెను దగ్గరకు తీసుకుని ఆ చెంపలవి ఆర్ద్రంగా నిమరాలని, ఇంకా ఏదో చెప్పాలనీ అనిపించింది.

'అది మనం దిగిపోయిన రైల్లు అరుణా' అని. ★